## కూలితేనే కదులుతారా!

పెద్దఅంబర్‌పేట, జూన్ 7: ఇది మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం వైఎస్సార్ కాలనీలోని విద్యుత్‌స్తంభం. ఇటీవల కురిసిన వర్షాలకు కొంచెం కుంగింది. వర్షాలు పడినప్పుడల్లా కొంచెం కొంచె వంగిపోతున్నది. ఇప్పటికే తీగలు పక్కనే ఉన్న ఇంటికి తగులుతున్నాయి. మరో రెండు వర్షాలు పడితే స్తంభం కూలి, రోడ్డుపైనో లేదా ఇంటో పైనో పడి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. స్తంభం వంగిపోతున్నదని, సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులకు పది రోజుల కిందే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. స్తంభం కూలితేనే అధికారులు స్పందించి కదులుతారా అని మండిపడుతున్నారు.

## ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మండల వైద్యాధికారిణికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

యాచారం, జూన్7: ఆశవర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మండల వైద్యాధికారిణి రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు ప్రతి నెలా రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 2న తప్పనిసరిగా వేతనాలు అందేలా చూడాలన్నారు. రూ.50లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలను అమ్మితే ఊపేక్షించబోం

- మండల వ్యవసాయ అధికారిణి రాగమ్మ

ఎరువుల దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిణి రాగమ్మ

మొయినాబాద్, జూన్ 7 : నకిలీ విత్తనాలను ఎవరమ్మినా ఊపేక్షించేది లేదని మండల వ్యవసాయ అధికారిణి రాగమ్మ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ఆర్ఐ చంద్రమోహన్‌తో కలిసి తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. పత్తి విత్తనాలు అమ్మితే ఎంఆర్‌పీ ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. రైతులకు సరిపడా విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు.

## నీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం

ఆమనగల్లు : పాపిశెట్టి దుర్గను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, జూన్ 7 : ఆమనగల్లు పట్టణానికి చెందిన పాపిశెట్టి అరవింద్ కళ్యాణి దంపతుల కూమార్తె దుర్గ నీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 637 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రాంమోహన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాసవి ఎడ్యుకేషన్ అధ్యక్షుడు మండెం చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు బికుమాండ్ల శ్రీనివాస్, బికుమాండ్ల నర్సింహ, నటరాజ్ యాదయ్య, శ్రీనివాస్, అర్థం లక్ష్మయ్య , పాపిశెట్టి శ్వేత, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

**మొయినాబాద్:** చిలుకూరు గ్రామానికి చెందిన దర్గ వందన, నరేందర్ దంపతుల కూతురు రిషిత నీట్ పరీక్ష రాసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో రిషిత 720 మార్కులకు గాను 625 మార్కులు సాధించి తన ప్రతిభను చాటింది. దీంతో గ్రామంలోని పలురువు నాయకులు, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు అభినందించారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

పెద్దఅంబర్‌పేట, జూన్ 7: వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు కౌన్సిలర్ పసుల రాజేందర్ అన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని పెద్దఅంబర్‌పేట కుంట్లూరు రోడ్డులో ఉన్న శ్మశానవాటికలో రూ.8 లక్షల నిధులతో చేపడుతున్న వెయిటింగ్ హాల్ షెడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన, నాణ్యతగా చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బుయ్య కృష్ణగౌడ్, దేశారం శంకర్‌గౌడ్, సంజీవ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా అమ్మితే కఠిన చర్యలు

ఆమనగల్లు, జూన్ 7 : నాటు సారా అమ్మే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ అన్నారు. శుక్రవారం తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లోని పాతకోట తండా, రేఖల గుట్ట తండా, పెద్దూరు తండా, సూర్య తండా, సూర్యానాయక్ తండా, హర్యానాయక్ తండా, లక్ష్మీతండా, కర్కస్ తండాల్లో నాటు సారాపై దాడులు నిర్వహించారు. 16 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. పాతకోటతండాకు చెందిన కొర్ర రాములును అరెస్టు చేశారు. కర్కస్ తండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్ పరారీలో ఉన్నాడని, అరెస్టు చేసిన వ్యక్తిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి టీం సీఐ చంద్రశేఖర్, మహేశ్వరం, ఆమనగల్లు సీఐలు , ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ మండల నాయకులు ఆయన నివాసంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొంగరవిష్ణు వర్ధన్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, కావలి బుగ్గ రాములు, జయానందం, రమాకాంత్‌రెడ్డి, చీమల జంగయ్య, అనగల్ల యాదయ్య, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

– మంచాల, జూన్ 7

వర్షపునీటితో పొంగిపొర్లుతున్న మురుగుకాలువ

వర్షపునీటిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

# దంచి కొట్టిన వర్షం

- నీట మునిగిన దేవి ట్రావెల్స్, సాయితేజ ఆటోమొబైల్ షాపులు
- పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్

నీట మునిగిన దేవిట్రావెల్స్, సాయితేజ ఆటో మొబైల్ దుకాణాలు

షాద్‌నగర్ టౌన్, జూన్ 7: షాద్‌నగర్‌లో శుక్రవారం మధ్యాహ్నం వర్షం దంచి కొట్టింది. పలు కాలనీల్లోని వీధుల్లో వర్షపునీరు నిలవడంతో వాహనదారులు, పాద చారులు ఇబ్బందులు పడ్డారు. షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట్ రోడ్డు నివాసాల మధ్య ఉన్న మురుగుకాలువ వర్షపునీటితో నిండి పొంగిపొర్లింది.

**నీట మునిగిన దుకాణాలు**

ఈ వర్షంతో షాద్‌నగర్ పట్టణంలోని గాంధీనగర్‌కాలనీ, పాత జాతీయ రహదారి సమీపంలోని సెల్లార్‌లో ఉన్న దేవి ట్రావెల్స్, సాయితేజ ఆటోమొబైల్ దుకాణాలు నీటి మునిగాయి. దుకాణాల ముందు ఉన్న మురుగుకాలువ నుంచి వచ్చిన నీటితో పాటు వర్షపునీరంతా దుకాణాలను ముంచాయి. దుకాణాల్లో కంప్యూటర్లు, జిరాక్స్‌మిషన్లు, ఇన్‌వైటర్లు, ప్రింటర్లు, ఆటోమొబైల్స్‌కు సంబంధించిన స్పేర్‌పార్ట్స్ పూర్తిగా నీటి మునిగాయి. దుకాణాలు నీట మునగడంతో రూ. ఆరు లక్షల వరకు నష్టం వాటిల్లిందని వ్యాపారులు లబోదిబో మంటున్నారు. మురుగుకాలువ సరిగ్గా లేక వర్షం కురిసినప్పుడల్లా షాపులు నీట మునుగుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. నీట మునిగిన దుకాణాలను మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న పరిశీలించారు. సెల్లార్‌లోని మురుగు, వర్షపునీటిని సిబ్బందితో వెలికి తీయించారు. రానున్న రోజుల్లో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకునేలా అధికారులతో చర్చించారు.

## పీఏసీఎస్ అటెండర్ రాములు మృతి

యాచారం, జూన్7: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న నానక్‌నగర గ్రామానికి చెందిన కట్టెల రాములు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి సంఘం చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సీఈవో నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జంగమ్మ, పీఏసీఎస్ డైరెక్టర్లు మద్దెల శశికళ, లక్ష్మయ్య, మక్కపల్లి స్వరూప తదితరులున్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

ఆమనగల్లు, జూన్ 7 : రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయించరాదని మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి డీలర్లకు సూచించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డును ప్రతి రోజు అప్డెట్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీలర్లు చంద్రశేఖర్, రవి, చంద్రమౌళి, మధు, రాజు పాల్గొన్నారు.

## ఫిల్టర్ నీళ్లను వృథా చేయవద్దు

మల్లాపూర్ తండాలో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

నందిగామ, జూన్ 7 : కొత్తూరు మండలం మల్లాపూర్ తండాలో ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం ఎంపీపీ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజలకు తాగు నీటి సమస్య రాకుండా ఉండేందుకు వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. నీటిని వృథా చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీనాయక్, రాందాస్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ దశరథ్, నాయకులు నర్సింహారెడ్డి, జయేందర్‌రెడ్డి, పాపిరెడ్డి, దయానందరెడ్డి, రాములు, మల్లేశ్, రాజు, దర్శన్ పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి నిరంతరం కృషి

- ఎంపీపీ సుకన్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం, జూన్ 7: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మండల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయం, విద్యా, వైద్యం, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర అంశాలపై ముమ్మరంగా చర్చించారు. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ముఖ్యంగా విద్యుత్ సమస్యలపై సభ్యులు ఏకా సందీప్‌పై మండిపడ్డారు. సమస్యల సత్వరమే పరిష్కరించాలని కోరారు. మండలంలో అక్రమ వెంచర్లపై చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఉమారాణి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి వెంచర్లలో 10శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీకి కేటాయించాలని, అట్టి భూమిని గ్రామపంచాయతీ పేరు మీద వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీపీ సుకన్య మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి వెంచర్‌లోనూ 10శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీకి కేటాయించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య బృందం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని వైద్యులకు సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

- కొనసాగుతున్న బడిబాట
- విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నంరూరల్ : చర్లపటేల్‌గూడలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 7 : బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంపీపీ కృపేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని తమ తల్లిదండ్రులు తప్పనిసరిగా బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీడీవో క్రాంతికిరణ్, ఎంఈవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని కర్ణంగూడలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలల యూనిఫాం స్టిచ్చింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు.

**చేవెళ్ల రూరల్ :** బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కందవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర బోగం, కౌకుంట్ల జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య అన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన 'బడిబాట' కార్యక్రమం రెండో రోజూ కందవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కౌకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కౌకుంట్ల హెచ్ఎం లక్ష్మయ్య పక్క గ్రామమైన తల్లారంలో ఇంటింటికీ తిరుగుతూ.. కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, సకల సదుపాయాలు కల్పించి బోధన చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

**యాచారం :** అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమం కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, యువకులు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభు త్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఉత్తమ విద్యనందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవీజీ ఫౌండేషన్ చైర్మన్ ఆడాల గణేశ్, నాయకులు శివమోదీ, ఉపాధ్యాయులు జోగు కృష్ణ తదితరులున్నారు.

**చేవెళ్లటౌన్ :** బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చేవెళ్ల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం. మెహ్రూనీస అన్నారు. చేవెళ్లలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 5 నుంచి 14 సంవత్సరాల్లోపు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో జంగయ్య, శ్రీనివాస్ రెడ్డి, వేణు, నరేందర్ రెడ్డి, మహేందర్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు అందజేత

పుస్తకాలను ఉపాధ్యాయులకు అందజేస్తున్న జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, ఎంఈవో శంకర్‌రాథోడ్

షాద్‌నగర్‌టౌన్, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలకు పంపిణీ చేసిన పుస్తకాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతతో కూడిన ఉత్తమ విద్యాబోధన ఉంటుందన్నారు. ఎంఈవో శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ.. మండలానికి మొత్తం 60వేల పుస్తకాలకు 32 వేల పుస్తకాలు వచ్చాయని, వాటిని 70 పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నంరూరల్ :** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం నుంచి మండలంలోని ఆయా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన పాఠ్యపుస్తకాలను శుక్రవారం తరలించారు. ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను అందజేశారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నందున ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడుల్లో చేరేవిధంగా తమ తల్లిదండ్రులు చొరువ చూపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## షాబాద్‌లో బొడ్రాయి బోనాలు

షాబాద్, జూన్ 7: షాబాద్ మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి షాబాద్‌లోని బొడ్రాయి విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపు చేపట్టారు. బోనాల ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామం మార్మోగింది.

**నందిగామ :** మొదళ్లగూడ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బొడ్రాయి పూజ, హోమం ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నవీన్‌గౌడ్, సుదర్శన్, సతీశ్, చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, వేమారెడ్డి, శ్రీపతిరెడ్డి, నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నల్లా కనెక్షన్ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

సమావేశానికి హాజరైన పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు

షాబాద్, జూన్ 7: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం నుంచి గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వేయాప్‌లో ప్రతి ఇంటికీ సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలతో పాటు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా...? లేదా అనే విషయాలను నమోదు చేయాలని సూచించారు. యాప్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత నల్లా ఫొటో తీసుకుని అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో గీత, మిషన్ భగీరథ ఏఈ చంద్రమౌళి, కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్య